కథ :

నా పాత స్నేహితుడు

పి. శశిధర్

నేను మా ఊరికి వెళదామని స్టేషన్లోకి వచ్చేసరికి రైలువచ్చి సిద్ధంగానే వుంది. గబగబ టికెట్ తీసుకుని వచ్చి రైల్లో కూర్చున్నాను. సాధారణంగా ఎంతో ఆలస్యంగా వచ్చే రైలు సరైన సమయానికే రావటం వల్లనో ఏమోగాని పెద్దగా ప్రయాణీకులు లేరు. అంతకు ముందు రైల్లో ఉన్న ప్రయాణీకుల్లో కూడా గోదావరి ఆవలివైపు బొగ్గుగని కార్మికులే ఎక్కువ.

ప్లాట్ ఫారం మీద ఆ కాస్త సందడికూడా తగ్గలేదు. ఎక్కేవాళ్లు ఎక్కుతున్నారు. దిగేవాళ్లు దిగుతున్నారు. ఎవరో పల్లెటూరి స్త్రీ - మధ్య వయసు దాటింది. రాతెండి టిఫిన్ డబ్బాలో నీళ్లు పట్టుకుని వస్తూ నా కిటికీ ప్రక్కన ఆగింది. పాలిష్టర్ అంగీ వేసుకుని, తెల్లగ పాలిపోయి నా ఎదురుగా కూర్చున్నతని దిక్కు చూసింది. ఒక్క క్షణం చూసి, "అయ్యో కొడుకా నువ్వేనా ? నేనెవరో అనుకుంటాన— పురాగ ఎట్లనో అయినవ్ కొడుకా ? " చెవుల గెంటీలు అటూ ఇటూ ఊగులాడంగ అన్నదామె. నోట్లో కాలుతున్న బర్కిలి సిగరెట్టును తీసి చేత్తో పట్టుకుని,

"నేనేనే పెద్దవ్వా ! " అన్నాడతను.

"నా కోడలూ, మనుమలు, మనుమరాండ్లు అంత బాగున్నారా బిడ్డా ?" అన్నది.

"హాఁ ఇప్పటికైతె అంత బాగానే వున్నం" అన్నడు ఆయన. ఆ ముసలామె మరింత దగ్గరకు వచ్చి "పురాగ జిగి సచ్చిన మనిషి తీరుగ అయినవ్ కొడుకా ! ఏదన్నా అలుకటి పని చూసుకోక పెయినవ్ ? బాయి పనింట్ల (గని పని) పీనుగెల్ల !

బతికున్న కొడుకులల్ల మీ రూపం జూసుకుంద
కన్నీళ్ళ ఆపుకోని చేయెత్తి దీవెనిత్తు
కూలి రాజ్యం పోరు గెలవనిరో నా కొడుకో నారాయణరెడ్డి
నా కొడుకులంత సల్లగుండనిరో....

(కారంచేడు ఒగ్గుకథలోని - నాకొడుకో బంగారు తండ్రీ అనే బాణీలో పాడుకోవాలి)

(1988 అక్టోబర్‌లో ఎన్‌కౌంటర్ పేర చంపబడ్డ గిద్ద ఆర్ వై ఎల్ నాయకుడు కా॥ దుమాల నారాయణరెడ్డి స్మృతిలో)

నా మనుమడు కూడ గిట్లనే అయిండు" అన్నది. అతను నిరాశాపూరితంగ నవ్వాడు. అంతలోనే ప్రక్క డబ్బాలోంచి "ఓ అవ్వా!" అని కేకవేశారెవరో! "పొల్ల పిలుస్తాంది వత్త బిడ్డా" అనుకుంట ముసలమ్మ వెళ్లిపోయింది.

గార్డు విజిల్ ఊదిండు. రైలు మెల్లగా కదిలింది. నా మనసులో మా అమ్మ మెదిలింది. పోగానే నన్ను పులుకుపులుకున చూస్తూ అడిగే మొట్టమొదటి ప్రశ్న "అంత ఎట్లనో అయినవ్ బిడ్డా" అని. నా ఆరోగ్యం గురించి ఎంత ఆందోళన చెందుతూ అడుగుతుందో కదా అని ఆలోచించే కొద్దీ నా మనసు వికలమైంది. కాని నేనేం చేయను? చేతులపై పీచుతీరుగ ఉబ్బి పైకి తేలుతూ కనిపిస్తున్న నరాలు, చేతి వేలి కొసలు చిట్లి, బొగ్గు చూర, కూరుకుపోయిన పగుళ్లు, కుడిచేతి మణికట్టుపై బొగ్గు పెళ్ల పడి అయిన గాయపు మచ్చ! రోజుకు కొన్ని గంటలు—భూమి లోపలి బొగ్గు పొరల్లో- విపరీతమైన గర్మిలో ఉడికీ ఉడికీ చేవచస్తున్న నా శరీరం వంక ఒకసారి చూసుకున్నాను. బొగ్గుగనిలో బొగ్గును పేల్చి పడగొట్టిన ప్రేలుడు మందుపొగ, బొగ్గు దుమ్ము పీల్చి పీల్చీ కడుపులో పేగులు తెగిపోయేలా దగ్గుతూ సంవత్సరాల తరబడి పని చేయాల్సి రావడం - మంచి గాలిలేక పీల్చిన గ్యాసులవల్ల తిన్న తిండి అరగక పోవడం- దాని మూలంగా కడుపునొప్పి- నరాల బలహీనత- ఆఖరికి శరీరం నొప్పుల కుప్పగా మారడం- ఆస్పత్రులూ మందులూ అదొక కంటి తుడుపు వ్యవహారం!

గని పనిలో చేరిన కొన్నాళ్ళకు నన్ను చూసిపోవడం కోసం వచ్చిన మా అమ్మ "ఏదన్న అలుకటి పని చూసుకోరాదు బిడ్డా!" అంది కాని అమ్మకు ఇక్కడి సంగతులు ఏం తెలుసు?

పనిలో చేరిన మొదట్లో తానూ ఓవర్‌మ్యాన్ చుట్టూ, అండర్ మేనేజరు చుట్టూ చాలా తిరిగాడు. బొగ్గు తట్ట మోయడం తనవల్ల కావడంలేదని చెప్పుకున్నాడు. ఒక అధికారి ఇంటికి పిలుచుకుని తోటపనంతా చేయించుకుని "మజ్దూర్ పని రాయించుత గని రోజు ఒక గంట ఇంటికాడ రావల్సి వుంటది ర పిలగా!" అన్నడు. అప్పటికే తనకు ఎట్లాగో అన్పించింది. ఇంటికి ఎందుకు రమ్మంటున్నరో తనకు తెల్సు. ఆ అధికారికి నాలుగు 'బర్లు' ఉన్నయి అంటె తాను వాటిపని చూడాలన్నమాట! చూస్తేనే మజ్దూర్ పని ఇప్పిస్తాడన్నమాట. ఆ పని లేకపోయినా ఫరవాలేదు. కాని తనిలాంటి నంగి నంగి పనులు చేయటానికి రాలేదు. కష్టపడి బతకడానికి వచ్చిండు.

వేలాదిమంది గనుల్లో బొగ్గు తట్ట ఎట్లా యాతనలు పడి మోస్తున్నరో తానూ అలాగే మోస్తాడు! అంతే ఇక ఎవరికీ ఏనాడూ సలాం కొట్టాల్సిన అవసరం పడలేదు. మొదట్లో బొగ్గు తట్ట నెత్తినెత్తుకోగానే మెడనరాలు జువజువలాడినాయి. కాళ్ళూ చేతులూ గజగజ వణికినయి. కొన్నాళ్ళకు, అలవాటు పడిపోయాక గనిలో అన్ని సౌకర్యాలుంటె తట్ట మోయడం పెద్ద ఇబ్బంది ఏం కాదనుకున్నడు. కాని కాలం గడిచిన కొద్ది గనులు లోతుకు వెళ్ళడం - పీల్చడానికి సరిపడా గాలి లభించక ఇబ్బందుల పాలవడం, కాలి బూట్ల దగ్గర్నుంచి మోసే తట్టలదాకా ప్రతిదీ గొడవలతో తప్ప మేనేజిమెంటు ఇవ్వని పరిస్థితులు. అటువంటి పరిస్థితుల మెరుగుకోసం యాజమాన్యాన్ని నిలదీయడం!

వరుసగా చేదు అనుభవాలు జ్ఞాపకానికి వస్తుంటే నా కెందుకో చిన్నగా నవ్వు వచ్చింది. అలుకటి పని సంపాయించుకోవడం గాని, ఆరోగ్యం చెడకుండా ఉంచుకోవడంగాని నా ఒక్కడి వల్ల ఏమవుతుంది?

పొద్దు పడమటి కొండల్లోకి జారుతోంది. చుట్టూ చిన్న చిన్న గుట్ట బోర్లు-తుప్పలు- వాగులు- రైలు నిమ్మళంగా సాగుతోంది. ఏదో స్టేషన్ వస్తున్నట్టుంది. చిన్న స్టేషన్! అపక్క- ఈపక్క- చిట్టడవి- స్టేషన్లో పెద్దగా ప్రయాణీకులు ఎక్కిందీ లేదూ, దిగిందీ లేదు. రైలు ఎంతకూ కదలడం లేదు. ఎర్రజెండా పచ్చజెండా పుచ్చుకున్న స్టేషన్ మాష్టరు అటూ ఇటూ తిరుగుతున్నడు. బఠాసీల వాళ్ళు, పండ్ల వాళ్ళు ఈ డబ్బాలోంచి ఆ డబ్బాలోకి, అ డబ్బాలోంచి ఈ డబ్బాలోకి ఎక్కి-దిగుతున్నరు. ఎత్తైన ప్లాట్‌ఫారం లేకపోవడం వల్ల చాలామంది ప్రయాణీకులు క్రిందికి దిగలేక డబ్బాల్లోనే కూర్చున్నరు. చాతనైన వాళ్ళు కొందరు ప్లాట్‌ఫారం మీదికి దుముకుతున్నరు. ప్లాట్‌ఫారం మధ్యలో 'నెమలి నార' చెట్ల నీడ, క్రింద పచ్చని గరిక. దిగుదామా వద్దా అని ఆలోచిస్తూ ఉండిపోయేంతలోనే రావాల్సిన ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి దణ దణ లాడుతూ పోనే పోయింది. అయినా మా రైలు కదలక పోయేసరికి విసుగనిపించి కిందకు దిగాను. పాదాలకు మెత్తగా చల్లగా గరిక తగిలింది. చేతులు జేబుల్లో దోపుకుని నిలబడి రైలు కొసా మొదలు చూస్తూ నిలబడి వున్నాను. చేతుడు నడుంపై ఆనించుకున్న ఒకాయన ఎవరో నన్నే చూస్తున్నట్టుగ అనిపించింది. ఎవరబ్బా అతను? కండపట్టిన చెంపలు, పెరిగిన క్రాపు, కళ్ళకు నల్ల కళ్ళద్దాలు ఎవరతనూ?

అంతలోనే గార్డు విజిల్ ఊదిండు. ఒకర్నొకరు తోసుకుంటూ ఎవరి పెట్టెల్లోకి వారెక్కారు. రైలు మెల్లగా కదిలింది. నేను మళ్ళీ ముందుకు చూస్తే అపుడు తట్టింది. అతను నిరంజన్! అవును నిరంజనే!! కొంచెం లావు అయ్యాడు. అతను నన్నే చూస్తున్నాడు. నేను ఆనందం పట్టలేకపోయాను. "నిరంజన్" అని గట్టిగా పిలిచాను. ఒక్కసారిగా పిలవడంతో నా ప్రక్క నిలబడ్డవారు ఆశ్చర్యంగా చూశారు. నిరంజన్ చెయ్యెత్తి ఊపిండు. ఏదో అంటున్నాడు. టపటప రైలు క్రాసింగులు దాటుతున్న చప్పుడు. నాకేదీ విన్పించలేదు. స్టేషన్లో దిగినాక కలుసుకుందామన్నట్టుగ చేతి సైగల్ని బట్టి అర్థం చేసుకున్నాను.

నా మిత్రుడు- బాల్యం నుంచీ నా మిత్రుడైన నిరంజన్ దారిలోనే కలిసినందుకు నాకు ఆనందమైంది. డబ్బా లోపలికి వచ్చి కిటికీ ప్రక్క నా సీట్లో కూర్చున్నాను. రైలు ఛక్ ఫక్ మని సాగిపోతోంది. చెట్లని గుట్లల్ని కాలువల్ని బర్రెల్ని అన్నింటిని వెనక్కి తోసేస్తూ రైలు గర్వంగా ఠీవిగా వెళ్తోంది. పైన ఆకాశంలో పక్షులు అలవోకగా పశ్చిమానికి వెళుతున్నాయి. నా మనసు ఉద్వేగభరితమైంది. రెండు సంవత్సరాలు అయింది నేను ఊరును విడిచీ, నా స్నేహితున్ని విడిచీ. తిరిగి వెళుతున్న రోజే దారిలోనే నిరంజన్ను కలుసుకోగలిగినందుకు హఠాత్తుగా నా కళ్ళలోకి దుఃఖం పొంగుకువచ్చింది. తెంపివేయబడ్డ సంబంధాల తాలూకు విషాదం.

చిన్నతనాన అతనూ నేనూ కలిసి ఆడాం. పాడాం. దినమొలల్తోనే పడిపోతున్న మొండిగోడల మధ్య - వాన నీటికి అడ్డు కట్టలు కట్టేవాళ్ళం - కాలువలు తీసేవాళ్ళం - చిన్న చిన్న మళ్లు చేసేవాళ్ళం - పరినారు బండ్లలోంచి జారిపోయిన నారు పిడచల్ని తెచ్చి నాటు పెట్టేవాళ్ళం- మక్కపెరళ్ళ పిట్టల కావలి-ఎండుపుల్లలు ఏరడం - కంకులు కాల్చడం - ఒక చేత్తో కంకి మరో చేత్తో ఒడిశెల - అద్దాలు పరిచినట్టున్న వాననీరు నిండిన బీటు పొలాల్లోని నీటిని చెక్‌పక్ మని తన్నుకుంటూ పరుగెత్తడం - ఎంత్రకాయల్ని దారాలకు కట్టి ఆడించటం - గాలపుచేపలు పట్టడం - చెరువుల్లో దొరువుల్లో తపతప కాళ్ళు చేతులా కొడుతూ ఈదులాడటం - మెత్తని దుక్కుల్లో సుతిమెత్తగా నడవటం - మొక్కలు మొలిచినవో లేదో రోజూ చూడటం - ప్రేమగా వాటి మొదళ్ళకు మట్టిని తోయడం - పైరుల్ని కౌగలించుకోవడం వాటి లేత ముఖాలను పదిలంగా ముద్దాడటం - "హో! సెట్టులెక్క

393

గలనే సెంచిత గుట్టలెక్కగలనే సెంచిత' అరెరె.... కుక్కలు దునికిన చోటరా ఖశ్ గుర్రాలు దునుకుతుండెరా!" గంటె భాగోతుల నాటకాలు - వెంకట్రాజం ఆరెమరాఠీల బుర్రకథా - అనేక రాత్రులు పొరుగూళ్ళకు కూడా పోయి చూసే వాళ్ళం - వినేవాళ్ళం.

అట్లా మా బాల్యం, పచ్చ పచ్చని మొక్కల లేలేత మొఖాల వంటి మా బాల్యం పెనవేసుకుని సాగింది. అటువంటిది అతనూ నేనూ కలుసుకుని ఎంతకాలమైంది?! రెండేళ్ళ కిందిదాక అతడు నా ఏకైక మిత్రుడు - రహస్యాలంటూ మా ఇద్దరి మధ్య ఏమీ ఉండేవి కావు. ఒకేవాడ - ఎదురెదురిళ్లు. వాడెక్కడుంటె నేనక్కడ. నేనెక్కడుంటె వాడక్కడ.

మా ఊళ్ళో చదువు అయిపోగానే మేం పొరుగూర్లో చదువుకోవడానికి పోయాం. అక్కడా కలిసే! వస్తే ఊళ్లో కలిసే! చెట్టాపట్టా లేసుకుని చేస్లూ చెలకలు తిరిగేది చదువుకంటె మాకు పొలాలమీదనే ధ్యాస ఎక్కువగా ఉండేది. ఆ చదువేమిటో అంతుచిక్కకపోయేది తెలంగాణా ఎజిటేషన్ అన్నారు-గొడవలు-హర్తాళ్లు - క్రమంగా మా చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. ఎలాగూ వ్యవసాయం ఉందికదానే ఢిలాసా కూడా వుండేది. అలా మేం వ్యవసాయంలో దిగబడ్డాం. దిగబడ్డామని ఎందుకనడం అంటె అప్పటిదాకా చుట్టం చూపుగా మాత్రమే మాకు వ్యవసాయం గూర్చి తెలుసు. చదువు గురించి మా తల్లిదండ్రులు పడే వేదనకు మేం విసుక్కునేవాళ్ళం. కాని వారి వారి అభీష్టాలకు వ్యతిరేకంగా వారిలాగే మేం "ఎద్దు ముడ్డి పొడవడానికి" పనికి వచ్చాం.

అప్పటికే కాలం మునుపటి తీరుగా లేదని మా పెద్దలు వాపోతుండటం నాకు స్పష్టంగా జ్ఞాపకం. ముఖ్యంగా పనిపాటల వాళ్ళ విషయంలో 'మందలియ్య వళంగా కుంట ఉన్నదనే' అభిప్రాయం వ్యక్తపరిచేవారు.

నిరంజన్ వాళ్ళ తాతగారి హయాంలోనైతె వ్యవసాయం చేయించడానికి కూడా ఒక పెగేవారు ఉండేవాడట నిరంజన్ తండ్రి కాలం వచ్చేసరికి అతనుకూడా స్వయంగ వ్యవసాయం చేసుకుంటే గాని గడువని స్థితి వచ్చింది. ఇక మా కుటుంబం విషయానికివస్తె మొదట్నుంచీ మాది కష్టపడి పని చేసుకుబతికే చిన్న రైతు కుటుంబం మాత్రమే. ఒక నాగలికి సరిపడా భూమి మాత్రం ఉండేది. నేనూ

394

నిరంజన్ వ్యవసాయంలోకి వచ్చేసరికి ఖచ్చితంగా నడుం వంచి పనిచేస్తేనేగాని గడవని స్థితి వచ్చింది. కనీసం వ్యవసాయంలోనైనా సమర్థుడిం అనిపించుకోవాలని పట్టుదల. మాకో చిన్న పాలేరు ఉండేవాడు. అతనూ నేనూ మా నాయనా కలిసి చేసుకునేవాళ్ళం. నిరంజన్ వాళ్ళకు నలుగురు పెద్ద పాలేర్లు - గొర్లకు ఒకరు, గొడ్లకు ఒకరూ - నిరంజన్ పై పనులకోసం తిరిగేవాడు.

రోజంతా పనిపాటలు ముగించుకుని రాత్రి కాగానే మూడు బజార్ల దగ్గర కుప్పకూడేవాళ్ళం. అప్పుడు మా మధ్య చర్చకురాని విషయం ఉండేది కాదు. అమెరికా శత్రు దేశమని, రష్యా మిత్రదేశమని తలా తోకాలేని తీర్మానాలు చేసే వాళ్ళం.

అంతకు ముందే వ్యవసాయం 'అరుకోసి మూడు అతుకుడు'గా వున్నది. తిండి కోసంగా వున్న వ్యవసాయం మార్కెట్టు కోసంగా మారింది. అంతకు ముందున్న జొన్న, మక్కజొన్న, పెసర పంటల స్థానే మిర్చి వచ్చింది. అసలే వర్షాలు తక్కువ. మిర్చికోసం కొత్తగా బావులు తోడటం. మోటలతో నీళ్ల సరిపడక ఆయిల్ ఇంజన్లు - ఆ తరువాత కరెంటు మోటర్లు - వాటికోసం లంచాలు - పైరవీలు - మిర్చి పంటకు కావాల్సిన ఎరువులు కొనడానికి తగిన పెట్టుబడి కావాల్సి రావడం బ్యాంకుల చుట్టు తిరగడం - లంచాలుపోను వచ్చిన కాడికి మిర్చిపై పెట్టడం - బ్యాంకుల చుట్టు తిరుగలేక బయట అప్పులు చేయడంవల్ల వడ్డీలు అసలు కలిపి తడిసి మోపెడు అప్పుల్లో మునగడం —

విత్తనాల్ని సకాలంలో విత్తి - తగిన పెట్టుబడి పెట్టగలిగిన ఒకరిద్దరు రైతులకు పంట అందరికంటె ముందుగా చేతికి వచ్చేది. అదే సమయంలో వారా పంటను మార్కెట్టుకు తోలి లాభపడేవారు. పంటల సీజన్ జోరు కాగానే మొదట్లో ఉన్న ధరలు టప్పున పడిపోయేవి. రైతులు గందరగోళంలో పడిపోయేవారు. ఎవరో ఉన్న ఆసాములు ఒకరిద్దరు పంటను తగిన ధర వచ్చేదాక ఆపగలిగేవారు. సాధారణంగా చాలామంది రైతుల పరిస్థితి 'కర్రమీది గింజ వస్తేనే కంచం లేచేది' అన్నట్టుగా ఉండేవారు. అటువంటి రైతుల పరిస్థితి చెప్పనలవిగాదు. అడ్డగోలు ధరలకు పంటల్ని అమ్ముకోవాల్సి వచ్చేది. అట్లా ధరలున్నప్పుడు పంటలు లేవు. పంట

లున్నపుడు ధరలుండవు. వీటికి తోడు వర్షాలు అధికంగా కురిసినేడు ఒక బాధ! కురవనేడు ఒక బాధ. నేను వ్యవసాయం చేసినంతకాలం పట్టుమని నాలుగు వందల రూపాయల్ని కళ్ళ కూడా చూడలేదు. రైతులంత మిర్చి పంటవేసి నష్టపోతుంటె ఒకరిద్దరు ముందు చూపు కలిగిన ఆసాములు పొగాకు వేసి లాభపడేవారు. మరుస టేడు రైతులంతా పొగాకు పంట వేసేవారు. నాకింకా జ్ఞాపకం వుంది. మేం మార్కెట్టుకు తీసుకు పోయిన పొగాకుమీద పేడనీళ్ళు చల్లి 'ఇది పనికిరాదు' అని నిర్దాక్షిణ్యంగా చెప్పేశారు పొగాకు వ్యాపారులు. అట్లా ఆ సంవత్సరం రైతులంతా గొడగొడ ఏడుస్తూ అమ్మకం కాని పొగాకును పొలాల అడుక్కు ఎరువుగా తొక్కుకోవాల్సి వచ్చింది. దున్నిన బురదపొలంలో పొగాకును పరిచి తొక్కా లంటె నాకు కాళ్ళురాలేదు. ఆ పొగాకు పెంచడం కోసం మేం పడ్డ యాతన జ్ఞాపకానికొచ్చింది.

వీటికి తోడు ఆడపిల్లల పెండ్లిళ్ళ పెద్ద సమస్య. వ్యవసాయదార్ల కిచ్చి పెళ్ళిళ్ళ చెయ్యకూడదనే మా తల్లిదండ్రుల పట్టుదలతో ఏదో ఒక చిన్న ఉద్యోగమైనా సరె! అటువంటి వారికిచ్చే పెళ్ళిళ్ల చేయవలసి రావడంతో అప్పులు చేయాల్సి వచ్చేది. అటు వారు కట్నకానుకలు భారీగా అడిగేవారు. నిరంజన్ వాళ్ళ కుటుంబం చాలా భూమిని ఆడపిల్లల పెండ్లిళ్ళ కోసం అమ్ముకోవాల్సి వచ్చింది. మేం మా ఒకగానొక్క చెల్లెలి పెళ్లికోసం ఇల్లంత ఊడ్చి ఊడ్చి పోయాల్సి వచ్చింది. అందుకు తోడు నోములు - కొలుపులు - చావులు - పుటుకలా - ఇలా ఊపిరి సలుప లేనన్ని అప్పులు. చివరి సంవత్సరం కాబోలు! పొగాకుకు ధర కాస్తా పలికింది. అయితె ఏమైంది? క్రితం ముందచేడు అయిన అప్పులకు వడ్డీ కూడ రాలేదు.

ఈ గందరగోళాలన్నింటిని ఎండాకాలపు వెన్నెల రాత్రులా చలికాలపు దీర్ఘ రాత్రులా - చేన్ల దగ్గరో - కొడార్ల దగ్గరో పండుకుని చెప్పుకునేవాళ్ళం. ఈ కష్టా ల్లోంచి వ్యవసాయాన్ని గట్టెక్కించడం ఎలాగా అని మేం ఆలోచించేవాళ్ళం.

గతాన్ని చెదరగొడుతూ పెద్ద కుదుపుతో రైలు ఆగింది. అప్రయత్నంగా తల బయటకు పెట్టి ఏమిటా అని చూశాను. స్టేషను బయటే సిగ్నల్ కోసం ఆగింది. కొంతమంది ప్రయాణీకులు అక్కడికక్కడే దిగి తమతమ గ్రామాలవైపు పోతున్నారు. అలలతో వడిలేస్తున్న పచ్చ సముద్రంలాగ వరిపొలాలు. వీళ్ల లో

మేస్తున్న గొడ్డూగోదా, గొర్రె మేకా, చేలల్లో పనిపాటలు చేసుకుంటున్న వాళ్లు రైలును ఆసక్తిగా చూస్తున్నారు. పెట్టెలోపల ఇద్దరు దేశరాజకీయాల గురించి పెద్దగా చర్చించుకుంటున్నారు. ఒకామె చిన్నబోయిన ముఖంతో కొడుక్కు అరటిపళ్ళు కొనివ్వలేక సముదాయించ చూస్తోంది. కొద్దిసేపటికి రైలు కదిలింది. తలలూపుతూ పోయిరమ్మంటున్న పైర్లు - చేతులూపుతున్న పల్లెజనం -

అట్లా మా కుటుంబాలు అప్పులమధ్య కూరుకుపోతున్న ఆ కాలంలోనే మా ఊర్లో పరిస్థితులు చాలా మారినయి. పాలేర్ల జీతాలదగ్గర మొదలైన వ్యవహారం కూలిరేట్లు పెరుగాలని, వెట్టిపనులు బందని, ఆఖరుకు బంజరు భూముల్ని దున్ను కోవడం దాకా వచ్చింది. ఈ మధ్య నిరంజన్ దొరింటికి నడవటం - దొర తాలుకాకు నడవటం ఎక్కువైనాయి. పోలీసులు అప్పుడప్పుడు రావడం. 'యిందాక ఊళ్లెకు పోలీసోడు రాకుంట గడిచింది' అని కొందరు నిట్టూర్చేవారు. 'ఇవాళ బంజరుభూములు అన్నోళ్లు రేపు పట్టా భూములు అనరన్న గ్యారంటీ ఏముంది ?' అని కొందరు అనేవారు.

మొత్తం మీద గ్రామం గ్రామం తీరుగ కొకుండా ఒక కొత్త వాతావరణం నెలకొన్నది.

వ్యవసాయంలో మిర్చి రోగాలకు తట్టుకోని పండటం తగ్గింది. ఏ పంటవేస్తె పండుతుందో తెలియని అయోమయం రైతుల్లో కలిగింది. మా అమ్మ ఎప్పుడూ విచారిస్తుండేది. ముఖ్యంగా నా గురించి. 'మేమంటే ఎట్లనో నెగ్గుకచ్చినం బిడ్డ ! నువ్వీరొంపిల పడద్దూ అంటె పడితివి - ఏ చిన్న నౌఖరి దొరికినా బాగుండిపోవు' అంటుండేది.

కాని నేను చదివిన చదువుకు ఏ నౌఖరి దొరుకుతుంది ? ఎప్పటి మాటో ! కాలేరు (కాలరీ) మీదున్న మా చిన్నాయనింటికి పోతే ఆయన బలవంతం మీద ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో పేరు నమోదు చేయించుకుని వచ్చిన. నా మటుకు నాకు ఏ నౌఖరీ దొరుకుతుందన్న నమ్మకం లేకుండేది.

సరిగ్గా ఆ సమయంలోనే కాలేరుమీది మా చిన్నమ్మా, చిన్నాయనా మా ఇంటికి వచ్చారు. ఆ రోజు ఇంకా ఇప్పుడిప్పుడు గడిచిపోయినట్టుగా నాకు జ్ఞాపకం వుండిపోయింది. ఆ రోజు - ఎండాకాలపు పిండి వెన్నెల రాత్రి - ఇంటిముందు

397

ఎండబోసిన మక్కజొన్న కంకులపై మంచం వేసుకుని బోర్లా పండుకున్నాను. వెన్నెల కంకులపైబడి ఎర్రగా మెరుస్తోంది. పొడవు పొడవు కంకులతో - జారి పోతున్నా అడ్డం పొడుగూ పందిరి వేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాను. ఇంట్లోకి ఓ చెవికూడా వేశాను. మా నాయనకూ - మిగతా ముగ్గురికి వాదోపవాదాలు జరుగుతున్నట్టుగ అర్థమైంది. చర్చనీయాంశం నా భవిష్యత్తేనన్నది స్పష్టం.

నేను చాలా సేపు ఆలోచిస్తూ ఉండిపోయాను. ఆ తరువాత మరికొంత సేపటికి మా చిన్నాయన నా దగ్గరికి వస్తూ 'పన్నవా బిడ్డా !' అంటూ మంచంలో కూర్చున్నడు. దాదాపు నేను ఆ పరికే సిద్ధపడ్డాను. చిన్నాయన కాసేపు మాటలకోసం వెతుక్కుంటున్నట్టుగ ఉండిపొయిండు. ఆ తరువాత తన చేయి నా వీపుమీద వేస్తూ "బిడ్డా ! ఈ పాటికి నీకు ఎగుసం చేసుడంటె ఏందో తెలిసివుండాలె ! యిన్నేండ్లు మీ నాయిన ఎట్లనో చేసుకచ్చిండు. రైతుకు కాని కాలం దాపురమైంది" అని కొద్ది సేపు చెప్పి నా మొఖంలకు చూస్తూ "బాయిపనికి (బొగ్గుగని) నీకుకాల్ అచ్చింది ! ఇక్కడుంటె బతుకలేవు" అన్నాడు. బాయిపనంటె బొగ్గుతట్ట మోయడం, వెనుకటికి నైజాం కాలంల కూలినాలి చేసుకు బ్రతికేవారు మాత్రమే బాయిపనికి పోయేవారు. యిప్పుడో !

"ఏదో నాలోౘిజాలు తిప్పలు బడాలె ! తరువాత ఏదన్న అలుకటిపని చూసుకోవచ్చు." చిన్నాయన మాటలు. నేను అన్నింటికి సిద్దపడే ఉన్నానన్న విషయం ఆయనకు తెలియదు. ఆయనింకా అంటూనె ఉన్నాడు "ఎవరో ఏదో అంటరని చూడకు. ఖదరూ - ఖాందాన్ మనకు కూడుపెట్టయి. యిన్నవా బిడ్డా రేపొద్దున్నే లేసిపోదాం" అని చెప్పి ఇంట్లోకి పోయిండు.

నాకా రాత్రి ఇక నిద్రరాలేదు. గతానికి సంబంధించిన అనేక విషయాలు కందిరీగల తుట్టెలాగ నా మనసులో తిరుగ నారంభించినయి. అప్పటికే మాచిన్నాయన మాకు ఎంతో డబ్బు సాయం చేశాడు. చిన్నాయనకు తెలియకుండా చిన్నమ్మా ఇచ్చింది. వారు ఇవ్వడమే కాని మేం తిరిగి తీర్చలేకపోయాం. బాయిపని చెయ్యడమంటె మాటలుకాదు. పోనీ ఇక్కడ వుంటె బ్రతికే వీలులేదు. అట్లా ఎన్నడో నమోదు చేయించుకున్న పేరుమీద ఇట్లా 'కాల్' వస్తుందని నేను అనుకోలేదు.

తల్లిని తండ్రిని, పుట్టి పెరిగిన ప్రియాతి ప్రియమైన ఊరుని విడచి ఎక్కడికో దూరంగా దుర్భరమైన బొగ్గు గనుల్లోకి పోవాల్సి వస్తున్నందుకు నా మనసు

లోంచి దుఃఖం ఎగిసి ఎగిసి వచ్చింది. పుట్టిని తలక్రిందులు చేస్తూ పచ్చని పొలాల మధ్య స్వేచ్ఛగా జీవించాలనుకున్న కలల్ని - మొక్కల లేలేత చివుళ్ళవంటి నా కలల్ని ఎవరో నిర్దాక్షిణ్యంగా నరికి వేసినట్టు వెక్కి వెక్కి ఏడ్చాను. ఏడ్చి ఏడ్చి చివరకు నన్ను నేనే సముదాయించుకున్నాను. అప్పులు తీర్చుకోవచ్చు. వ్యవసాయం సజావుగా చేసుకోవడంకోసం నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చు అని నిర్ణయించుకున్నాను.

ఆ విధంగా తెల్లవారకముందే లేచి సిద్ధమై - కన్న తల్లిదండ్రుల్ని - ఉన్న ఊరునూ - నా జీవన సమస్తాన్ని విడిచి మా చిన్నమ్మా, చిన్నాయనలవెంట బొగ్గు గనుల్లో పనిచేయడం కోసం బయలుదేరాను. ఆ తెల్లారుతున్న వెలుగులో మా ఊరును మరీ మరీ చూస్తూ నేను వెళ్ళిపోయాను. ఆఖరుకు నిరంజన్‌కు కూడా చెప్పలేదు. 'గా బాయిపనికి మనం వెళ్ళడమేంది' అని నా నిర్ణయాన్ని ఎక్కడ సడలింపచేస్తాడో అన్న భయం వల్ల.

ఇక ఆ పోవడం - మా ఊరికి ఇదే తిరిగి రావడం. మధ్యలో రెండుసార్లు మా అమ్మానాయనలు వచ్చిపోయారు. అంతకు మినహా ఊరు గురించిన ఏ విషయమూ తెలియకుండాపోయింది. ముఖ్యం నిరంజన్ గురించి.

బొగ్గు గనుల ప్రాంతం పోయాకా తిరిగి మా ఊరికి రాకపోవడానికి మొదట్లోనైతే నేను చేసే తట్ట మోతపని నామోషిగ భావించే ! తరువాత తరువాత కొత్త జీవితపు ఒరవడిలో నేను కొట్టుకుపోవడం చీటికి మాటికి సమ్మెలు చేస్తారని, తాగి కాయిదపునోట్లను గాడిదలకు తినిపిస్తారని బొగ్గుగని కార్మికుల గురించి సాధారణంగా పల్లెల్లో అనుకుంటూ వుంటారు. నేనుకూడా పై రెండు అభిప్రాయాలు నిజమనే అనుకునేవాన్ని. నిజం కూడా ! కాని ఆ కఠోర వాస్తవాల వెనుక ఎన్నో కారణాలున్నాయని నాకు తరువా తరువాత తెలిసింది.

బొగ్గుగని లోపల చూసే ఏముంది ? భూగర్భంలోకి రోజూ మైళ్ళ కొద్ది నడవటం - పుట్టెడు బండకింద - కడుపుల పేగులు తెగి నోట్లోకి వచ్చేటట్లుగ బ్లాస్టింగ్ పొగవల్ల దగ్గుతూ - ముక్కుల్లో మూతుల్లో కడుపులోని పేగులవెంట పేరుకుపోయిన బొగ్గు దుమ్ముతో - కుమ్మరి వాములో కుండలు కాలినట్టుగ వర్కింగు ప్లేసుల్లోని వేడికి, శరీరాలు సలసల వేడెక్కి పోతుండగా - మెదనరాలు జువజువ

399

గుంజంగా - గంటల తరబడి బొగ్గుతట్ట మోస్తూ టబ్బులు నింపడం - కళ్ళు బైర్లు కమ్ముతోంటె నాలుక పిడుచకడుతోంటె ఎక్కడోవున్న మంచినీటి పంపుకోసం పరుగులు పెట్టడం - పంపుకింద వెల్లకిలా పండుకుని 'తేలగిల' పడిపోవడం - తిరిగిలేచి కడుపుల పేగులు తెగేలా టబ్బుల్ని దొబ్బి దొబ్బి హాలర్ తాడుకు అందించడం - దిమ్మెక్కిన తలలతో - నిస్సత్తువ శరీరాలతో - గంటలకు గంటలు నడుస్తూ పైకి ఎక్కి వచ్చేసరికి తలప్రాణం తోకకు వచ్చేది.

గని లోపల పని పరిస్థితులు బాగుచెయ్యాలని, వర్కింగు ప్లేసులో గాలి సప్లయి సరఫరా చెయ్యాలని, బొగ్గు మోసే తట్టలు, బూట్లూ ఇవ్వాల్సిన పద్ధతిలో ఇవ్వాలనీ, ఇలా ఎన్నో విషయాలకు మేం అధికార్ల తో గొడవపడాల్సి వచ్చేది. పనిముట్లు కిందవేయందే మాకు ఏ సమస్యా తీరేది కాదు.

మా గని ఉపరితలంపై తిరుగుతున్నంత సేపు నేనెప్పుడూ దక్షిణం వైపుగా ఎత్తయిన రామగిరి పర్వతం వైపు చూస్తుండేవాడిని. ఆ పర్వతం కావలిగా వున్న నా ఊరు నాకెప్పుడూ జ్ఞాపకం వచ్చేది. వెంటనే నా కండ్లల్లో గుబగుబాని నీళ్ళు ఊరేవి. పొలాల్లోంచి గనుల్లోకి బలవంతంగా తరమబడ్డానని భావించుకునేవాన్ని. అందుకు నాకు దేనిమీదో కోపం, ద్వేషం. దేన్నో సాధించాలనే కసి.

సహజంగానే అనివార్యంగానే నేనూ అందరితోపాటు సమ్మెల్లో పాల్గొనేవాన్ని. ఆ క్రమంలో నాకు అనేకమంది పరిచయమయ్యారు. అద్భుతమైన కార్మిక మిత్రులు. అట్లా కొత్త పరిచయాలు-కొత్త అనుభవాలు- కొంగ్రొత్త అధ్యయనాలు. ఈ సమస్త భూగోళాన్ని చిన్న గోళీకాయగా చేసుకుని నా అరచేతిలో పెట్టుకుని దాని బహిరంగాన్ని దాని అంతరంగాన్ని, దాని గతాన్ని, గమనాన్ని ఆగమనంతో సహా అన్నింటిని అణువణువునూ శోధించడం నేను ఇక్కడే నేర్చుకున్నాను. నా పాత జీవితాన్ని జ్ఞాపకం తెచ్చుకుని కుమిలిపోవడం తగ్గింది. నాగేటి చాళ్ళలోంచి బొగ్గు పొరల్లోకి ఈడ్వబడటం నా జీవితంలో పెద్ద మార్పు ఎలాగైతే అయిందో అదే విధంగా బొగ్గు గనుల్లోకి వచ్చిన తదుపరి క్రమక్రమంగా నా మనస్తత్వం పూర్తిగా మారింది. హఠాత్తుగా జరుగకపోయినా ఇది నా జీవితంలో రెండోమార్పు. స్వయంగా వ్యవసాయం చేసుకుంటూ, పనివాళ్ళతో చేయించుకునే రైతు దశ నుంచి కేవలం రెక్కల కష్టాన్ని అయిన కాడికి తెగనమ్ముకునే కార్మికుడి స్థితిలోకి నేను మారడం అన్నింటికి మూలమని నేను తరువాత తరువాత తెలుసుకున్నాను.

400

అట్లా పచ్చ పచ్చని పైరుల్లోంచి నల్లని బొగ్గు పెళ్ళల మధ్యకుపోయిన చాలా కాలానికి మా ఊరు వస్తోంచే రైల్లోనే నేను నా చిన్ననాటి స్నేహితున్ని నా పాత స్నేహితున్ని కలుసుకోగలగడం జరిగింది.

నిరంజన్ నా కిటికీ దగ్గరకు వచ్చి పిలిచేదాకా నాకు స్టేషన్ వచ్చిందని కాని, రైలు ఆగిందని కాని తెలియనే తెలియలేదు. రైలు దిగి ప్లాట్‌ఫారం దాటుతూ నేనతన్ని "ఎక్కడికి పోయి వస్తున్నవు?" అని అడిగాను. "పాలేరు పైసలు ఎగబెట్టి సింగరేణిలకు పోయిండు. పైసలు వసూల్‌కు బెల్లంపల్లి దాక పోయి వస్తున్న" అని అతనన్నాడు. ఏవో ప్రశ్నలు, జవాబులు. ప్లాట్‌ఫాం దాటాం. ఎదురుగా చౌరస్తాలో నల్లబడ్డ గాంధీ బొమ్మ! కుడిపక్క సందులో తడికలు తీసి రేకులు మార్చిన సినిమా టాకీసు - నూనె, బియ్యం మిల్లుల ఎత్తైన పొగగొట్టాలు. తళతళ లాడే షావుకార్ల ఎత్తయిన మేడలు - వీట్లో ధాన్యాలు అమ్ముకుని అవసరమైన సామాన్లకోసం దుకాణాల ముందు తిరుగుతున్న రైతులు - ఎడ్లబండ్లు.

ఒకప్పుడు యిదే రోడ్లమీద నేనూ, నిరంజను ఆ రైతుల మాదిరే బండ్లలో నిలబడి వాహనాల వంక ఎత్తైన షావుకార్ల మేడలవంకా చూసేవాళ్ళం. మా ధాన్య రాసులకు అడ్డగోలు ధరలు నిర్ణయిస్తుంచే గడ్ల నీడ కుక్కుకుంటూ నిస్సహాయంగ నిలబడి చూసింది ఇక్కడి బీటు గద్దెల పైన్నే! అట్లా ఎన్నెన్నో చేదు జ్ఞాపకాలు చుట్టు ముడుతుంటె నేనూ నిరంజన్ బస్టాండు వైపు నడిచాం. అప్పటికి చీకటి కానే అయింది.

ఆంజనేయుని ఆలయ నిర్మాణం కోసం చందాలు - బ్యాంకు ఎన్నికలూ నబ్బిడీలు - పోయిన అసెంబ్లీ ఎన్నికలు - ఎమ్మెల్యేతో తనకున్న దగ్గిరితనమూ - అట్లా నిరంజన్ నాతో మాట్లాడుతుండగానే బస్సురావడం అందరం దానిపైఎగబడటం ఎలాగో ఎక్కి బస్సులో ఆ చివర ఒకరం ఈ చివర ఒకరం నిలబడ్డాం. గడబిడ గంద్రగోళం-ఉక్కపోత-టిగకారే చెమటలు. బస్సులో మా ఊరివాళ్లు కూడా చాలా మందే అగుపించారు.

బస్సు మెల్లగా కదిలింది. రైలుగేటు--రైసుమిల్లు-ఆయిల్‌మిల్లు-కళావిహీనమై ఉన్న ఆయిల్ ఇంజన్ వర్కుషాపు-ప్రక్కనే వెలిగిపోతున్న కరెంటు మోటార్ల వర్కుషాపు-కట్టెకోత మిషన్లు-సున్నపు బట్టీలు రోడ్డుకు రెండువైపులా ముసలి

తుమ్మలు-గుట్టపై పచ్చగా వెలిగే మైక్రోవేవ్ స్టేషన్ లైట్లు-పల్లెలు-పంటపొలాలు-మెల్ల మెల్లగా నా జన్మస్థలానికి చేరుకుంటున్నాననే భావన !

బస్సు దిగేసరికి చీకటి బాగానే అయింది. నిరంజన్‌కోసం నేనాగితే నిరంజన్ పాన్‌షాపులో సిగరెట్లు కొంటూ ఆలస్యం చేస్తున్నట్టు అన్పించింది నాకు. నా కోసం ఆగిన మా ఊరివాళ్లు కొందరు పోదాం రమ్మని పిలుస్తున్నారు నన్ను. "అయినె కేంది అయినే వత్తడు" "మీరు రాండ్రి" అని అంటున్నరు. చివరికి మందితో నేను నడుస్తుంటే మా వెనువెంటే నిరంజన్ వస్తున్నడు.

చీకటి పూట గతుకుల బాట-పడుతూలేస్తూ నడక. పైగా వీళ్ల నా గురించీ-అక్కడి పనీపాటల గురించి అక్కడి మనుషుల గురించి ఆసక్తిగ అడుగుతున్నరు. వారు చాలా ఆదరంగా మాట్లాడుతున్నట్టు తోచింది. అంత సేపూ నిరంజన్ నడకలో ఎవరితోనూ మాట్లాడలేదు-ఎవరూ ఆయనతో కూడా మాట్లాడలేదు-నాకేమిటో అసహజంగా తోచింది.

ముదుసుకుంట కట్ట—తాడిచెట్లు—మామిడితోటా—కల్లుమండువ కల్లువాసన మండువకాడ యింకా సందడి తగ్గలేదు. చెట్లమీద పక్షుల చప్పుడు-తాటి కొమ్మల గల గల శబ్దాలు-బోయ్‌మని వీచే చల్లనిగాలి—అంతా గమ్మత్తుగా—చిరపరిచితమైన ఊపిరిని మళ్ళీ పిలుస్తున్నట్టు—

చేను చెల్కల మీదినుంచి రైతులూ రైతుస్త్రీలూ ముల్లెలతో, గడ్డి మోపులతో, ఎడ్ల ముందేసుకుని వస్తున్నరు. కొందరు ఆ చీకట్లో సైతం నన్ను గుర్తుపట్టి పలకరించారు. మా కుంటెంకయ్యగారి లచ్చమ్మ వదినైతే తన సహజ పద్ధతిలో "సితలపండు పలుగ, పోయిన కాన్నుంచి ఊర్నే మరిసిపోయినవు" అని స్వాగతం చెప్పింది.

"పొద్దున కలుద్దాం" అంటూ నిరంజన్ వాళ్ళింటికి వెళ్లిపోయాడు. నేను మా ఇంటికి పోయాను.

మరునాటి రాత్రి—పిండి కురిసినట్టు వెన్నెల—మిలమిల మెరిసే చుక్కలతో, దూదిపింజల తీరుగ కదిలిపోతున్న మేఘాలతో ఆకాశం ఎంతో మనోహరంగా వున్నది. సన్నగా తోలుతున్న పైరగాలి శరీరానికి ఆహ్లాదం కలిగిస్తున్నది.

ఎక్కడో దూరంగా ఎవరి కొట్టంలోంచో మేస్తున్న పశువు మెడలోంచి అయ

బద్దంగా బొనుగ చప్పుడు వినిపిస్తోంది. మూడు బజార్ల దగ్గర ఎవరో ఒకరు కూర్చున్నరు. బజారునిండా కావళ్ల భుజాలకేసుకుని గౌండ్లవాళ్లు—తాగబోయినవాళ్ళు వెళ్తున్నరు. ఎవరి ధోరణిలో వాళ్ళు ఎడతెగకుండా మాట్లాడుకుంటూ పోతున్నరు.

ఎవరో ఆడగొంతుతో "పోదమా వనసీమల—చెలి చూదమా వనసీమలా" అని మైనావతి నాటకంలో వనవిహార సందర్భంలోని మైనావతిలాగా పాడుతున్నడు.

నిత్యం డిబడిబ చప్పుళ్ళమధ్య—ఉక్కిరిబిక్కిరిచేసే బొగ్గు పొగల మధ్య—కండ్లు కప్పుకుపోయే బొగ్గు దుమ్ముధూళిల మధ్య—మురుగు కాల్వల వాసనల మధ్య గడిపి రావడం వల్లనో ఏమో నాకు ఎంతో ప్రశాంతంగ తోచింది.

రాత్రి భోజనాలు కాగానే బయట మంచాలు వాల్చాను. అమ్మ వంటిల్లు సర్దుకోవడంలో మునిగిపోయింది. నాయన బర్రెపాలు పిండుతున్నడు. పాయ తీసి కట్టేసిన దుడ్డె తల్లి దిక్కు గుంజుతోంది.

నిన్న రాత్రి మా అమ్మ అనేక సంగతులు చెప్పింది. మధ్యలో నిరంజన్ గురించి కూడా చెప్పింది. కాలం మునుపటి తీరుగా లేదని, మారకపోతే బతుకలేమని ఆ పాటి జ్ఞానం నిరంజన్‌కు ఎందుకు లేదోననీ మా అమ్మ విచారపడ్డది.

నేనట్లా విచారిస్తూ కూర్చుండగానే "ఎప్పుడచ్చింద్రు" అని ఎవరో అంటె నేను చూసిన. ఒకప్పుడు మా చిన్నపాలేరు సాయిలు. చిన్నప్పుడు! యిప్పుడు బాగా ఎదిగిండు. "బాగేనా" అని నేనంటె 'బాగే' అన్నడు. నెత్తిమీది తువ్వాల తీసుకుని కిందేసుకుని కూర్చుంటూ నా పని గురించిన వివరాలు అడిగిండు. మొదట్లోనైతే నేను చేస్తున్న పని చెప్పడానికి సంకోచించేవాన్ని. కాని యిప్పుడు ? వివరాలు చెప్పిన మీదట "మీరు చేసే బాయికే (గనిలోనే) మా బావ పనిచేస్తడని" చెప్పిండు. 'ఏం పేరని' నేనంటె, మిట్టపల్లి మల్లేశమని చెప్పిండు. నేను నవ్వుతూ మేం ఇద్దరం కలిపే పని చేస్తమని చెప్పినప్పుడు చూడాలి సాయిలు సంతోషం! మరింత దగ్గరికి జరిగి వాళ్ళ బావ గురించి, అక్క గురించి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నడు.

మా సంభాషణ గ్రామం వైపు మళ్ళింది. అతను చెప్తున్నాడు. నేను అడుగుతున్నాను. నిరంజన్ గురించి మాట్లాడుతూ "ఆయన గట్లనే చేస్తుంటె ఎవరో దొడ

బొక్కలిరుస్తరని" లేచిండు. "పొద్దు పోయింది ఉంటరుకద రేపు కలుత్త" అంటూ సాయిలు లేచి వెళ్ళిపోయిండు. సాయిలు కోపంతో అన్న మాట ఒక్క సాయిలు కోపంగానే తోచలేదు నాకు. అది వారందరి సామూహిక కోపంగా తోచింది.

నిరంజన్ పట్ల నా మనసు ఆందోళన చెందింది.

నేనతని కోసం ఎదురుచూస్తూ చాలా సేపు కూర్చున్నాను. అప్పటికే మా అమ్మ నాలుగుసార్లు పిలిచింది. "ఆయనేడ వస్తడు బిడ్డా నువ్వొచ్చి పండుకో" అని. అన్యమనస్కంగానే నేవెళ్ళి బయట మంచంలో పడుకున్నాను. నిద్ర రావటంలేదు. నిర్మలమైన వెన్నెలరాత్రిలో పైకి ఆకాశంలోకి చూస్తుంటె నాకేదో అంతులేని అగాధాల్లోకి చూస్తున్నట్టు తోచింది. అప్పటికే ఊరుడుకు మగ్గింది. కుక్క ఒకటి దూరంగా ఎక్కడో విషాదంగా ఏడుస్తోంది. ఆ ఏడ్పు ఎంతో దూరం విన్పిస్తోంది.

క్రమక్రమంగా నాకెప్పుడు నిద్రపట్టిందో తెలియదు. మా అమ్మ ఆదరాబాదరాగా నన్నుతట్టి లేపుతూ "నిరంజన్ను మాదిగిండ్లళ్ళ కొడుతున్నరట" అని చెప్పింది. నేను మంచందిగి అట్లాగే లుంగీ బనీను మీద మాదిగిండ్ల వైపు ఉరికాను. అప్పటికే భళభళ తెల్లారింది. పనిపాటలకు బయలుదేరే పాలేర్లు అందరు క్వార్టర్ల మధ్య (హరిజనులకు కట్టించిన క్వార్టర్సు) గుమికూడింద్రు. అరుపులు, తిట్లు, కేకలు తోసుకోవడాలు అంతా కలిసి నానా గంద్రగోళంగా వుంది. మధ్యలో నిరంజన్ తలమీద కొన్ని చేతులు బలంగానే పడ్డాయి. మరికొందరు అందర్నీ విడదీస్తున్నరు. నాకు ఎవర్ని వద్దనాలో - ఎందుకు జరుగుతోందో తోచలేదు. అంతలోనే గ్రామం లోంచి ఇద్దరు ముగ్గురు రైతులు కూడా వచ్చారు. "ఏదున్నంటె పరిష్కరించుకోవాలెగాని ఇదేం లొల్లి" అని అందర్నీ సముదాయిస్తున్నరు. ఆ గుంపులోంచి నిరంజన్ను బయటకు లాక్కువచ్చారెవరో ఆయన నోట్లోంచి నెత్తురు కారుతోంది. నా మనసు వికలమైంది.

ఊళ్ళోంచి వచ్చినవారు నిరంజన్ను మెల్లమెల్లగా నడిపించుకుంటూ గ్రామంలోకి పోయారు. నేనక్కడే నిలబడిపోయాను. ఎదురుగా క్వార్టరు ముందు చింత కింద ఒక పదేండ్ల పిల్లవాడు జ్వరం వచ్చిన వానితీరుగ నేలపై కూర్చున్నాడు. అతని ఒంటిపై పాతచీర నిండుగా కప్పింది తల్లి. శోకాలు తీస్తుంది, మధ్యమధ్యలో నిరంజన్ను శాపనార్థాలు పెడుతోంది. సంగతి బోధపడి బోధపడనట్టుగా వుంది. నిరంజన్ను

404

తిడుతూ అంత తొందరగా పదిలి పెట్టినందుకు తమలో తామే ధుమధుమలాడుతూ ఎటువాళ్ళు అటు వెళ్ళిపోయారు. అందాక నిలబడి చూస్తున్న సాయిలు కూడా నా దగ్గరికి వస్తూ "నాలుగు రోజుల్నుంచి అగో - అడకూసున్న పోరడు - జరంతోని గజగజ వణుకుతాండు. ముసల్దాని చేతుల దమ్మిడిలేక పోరనికి మందులేదు. మాకు లేదు. పొద్దున పొద్దునే ఎగోళం తీరుగ అచ్చి ఇంట్లనొచ్చి పోరన్ని రెక్కబట్టి ఇవతలికి గుంజుకచ్చిండు. వాండి పగల జరమట! పనికి రాకుంట తప్పిచ్చుకునే ఏషమట! వాన్ని అట్ల గొరగొర ఇగ్గుకత్తాంటె ముసల్ది వద్దు వద్దని అడ్డం తిరుగుతె ముసల్దాన్ని ఇయ్యర మయ్యర గుద్దుతాంటె అచ్చేటోళ్ళు పోయెటోళ్ళు అయినె పని చూసింట్రు" అని చెప్పిండు.

'ఏందీ ఈ మనిషి పూర్తిగ ఇట్లా అవుతున్నడు' అనుకుంటు నేను ఇంటికి వచ్చిన. వెంటనే నిరంజన్ దగ్గరికి పోవాలనిపించలేదు. వికలమైన మనసుతో ఆ రోజు చేన్లు చెల్కలు కలెతిరిగి వచ్చాను. సాయంత్రమైంది. భోజనం పూర్తి చేసుకుని నిరంజన్ ఇంటికి బయలుదేరాను. నిరంజన్ వాళ్ళమ్మ సబ్బండ వర్ణాలవారిని మూడు బజార్లకాడి దుబ్బతో సత్కరిస్తోంది. తండ్రి ఉండీ ఉండీ తిట్లతో దీవిస్తున్నడు.

అప్పటికే ఆరెంపి డాక్టరొచ్చి తలకు కట్టుకట్టి ఇంజక్షను గోళీలిచ్చి పోయిండట. నిరంజన్ ఇంటివెనుక మల్లెపందిరి కింద ఒంటరిగ పండుకున్నడు. నేను వెళ్ళి మంచం ప్రక్క నిలబడ్డాను. నిరంజన్‌పై నీడ పడేసరికి కళ్ళు తెరిచి నా వైపు చూసిండు. తరువాత ముభావంగా చీకట్లోకి చూస్తుండిపోయిండు. అట్లా కొద్దిసేపు ఇద్దరం మౌనంగానే గడిపాం. ఆ కొంపేపు నాకు చాలా దుర్భరంగా తోచింది. సంభాషణ ఎట్లా ప్రారంభించడమా అని నేను ఆలోచిస్తూ చివరికి -

"ఏమిటిది? పూర్తిగ మంచీ చెడు తెలియనివాని తీరుగ అయిపోయినవు? ఏమిటి నిరంజన్?" అన్నాను. ఆ ఒక్కమాటతోనే అతనికి ఎంతో బోధపడినట్టు చివ్వున తల నావైపు తిప్పి ఛీత్కార భావంతో "నీది నీకే మంచి-నాది నాకే మంచి" అన్నాడు.

ఆ మాటలతో నేను స్థాణువునై పోయాను. నా మనసంతా ఎట్లాగో అయిపోయింది. చేదు మాత్ర మింగినట్టు అన్పించింది. ఆ రెండు మాటలతో మా ఇద్దరి మధ్య ఏర్పడ్డ అఘాతం పైని ముసుగు ఒక్కసారిగ గుంజి చూపించినట్టు అయింది.

కలిసి పుట్టకపోయినా, కలిసి పెరిగాం. కలిసి ఆడాం. కలిసి పా[illegible]

405

మృత్యుదాహం

వరవరరావు

కన్నీళ్ళేమయినా మిగిలి వుంటే
కాలిపోతున్న అసహాయ మానవమాత్రులకోసం దాచుకుందాం
కసి ఇప్పటికయినా మనకేమీ కలగకపోతే
కతలల్లుతున్న మొసలి కన్నీళ్ళను నమ్ముకుందాం
మనకేం తెలుసు ఇంత అమానుష సందర్భాలు వస్తాయనుకుంటే
గోబెల్సును ఇప్పుడు గానీ పోలికకు తెచ్చుకునే వాళ్ళం
వాళ్ళ పార్ల మెంటును వాళ్ళే తగులబెట్టుకున్నవాళ్ళు ఎంతకు తగరని ?!
పేద పాసింజర్ల కోసం హాహాకారాల ప్రకటనలు
పత్రికలకు ఒక చేత యిస్తూనే
మరొకచేత పెట్రోల్ పట్టుకొని వెళ్ళగలరు

ఏమీ తెలియని అమాయకకాలంలో ఇద్దరం ఒకటే అనుకున్నాం. కాని నిజానికి బతుకులోకి వచ్చేసరికి ఆలోచన వచ్చేసరికి ఇద్దరి మధ్య ఎంత అఖాతం? ఇంతకాలానికి గాని ఒకరి మంచి మరొకరికి మంచి కాకుండా పోయింది.

మంచంలో పండుకుని నిరంజన్ - ప్రక్కన నిల్చుని నేను. ఇక ఏం మాట్లాడాలో నాకు తోచలేదు. నిజానికి ఇంక ఏం మాట్లాడగలను. ఆ గోడల మధ్య గాలి ఆడటమే కష్టమైంది. పైన వెన్నెల పందిరి కింద వికృతంగా నీడలు పాములతీరుగ అటూ ఇటూ కదులుతున్నాయి.

మరీ దుర్భరంగా తోచగానే ఏవో రెండు మూడు పొడి పొడి ప్రశ్నలు - జవాబులు పరస్పరం విదల్చుకోగానే నేను లేచి నిలబడ్డాను.

"నిరంజన్ ఇక నేను వెళ్ళివస్తాను" అన్నాను.

"మంచిది కలుద్దాం" అతనన్నాడు.

నిజానికి ఆ మాటలు అసాధ్యం అనిపించాయి.

ఈ చోటుకు నేను మళ్ళీ రాకపోవచ్చు.

నిరంజనూ నేనూ కలుసుకోకపోవచ్చు. ఆ భావన రాగానే నా శరీరంలోంచి ఏదో భాగం తెగిపోయినటువంటి బాధతో వడివడిగా ఆ ఇంట్లోంచి బయటపడ్డాను. మా ఇంటి వైపు.